క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత కొప్పిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ ఎంపీపీగా పనిచేసిన గణేష్ తండ్రి రవీంద్రనాథ్ ప్రసాద్ 25వ వర్ధంతిని పురస్కరించుకుని భారీఎత్తున అన్నదానం, దుస్తులు పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, భౌతికంగా రవీంద్రనాద్ ప్రసాద్ లేకపోయినా, ఆయన జ్ఞాపకాలు జనాల హృదయాల్లో నిలిచిపోయాయన్నారు. ఆయన పేరిట సేవా కార్యక్రమాలు చేపట్టిన కుమారుడు గణేష్, ఆయన కుటుంబ సభ్యులను అభినందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్ సబ్జెక్టు బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతుల రాంబాబు సోమవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి వారు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు జనవరి 2వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు అందజేయాలని కోరారు.

నేడు వాకలపూడి హైస్కూల్‌లో సైన్స్ ఫెయిర్

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంఈఓ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 9 గంటల నంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ సైన్స్ ఫెయిర్‌లో ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొని, తమ నమూనాలను ప్రదర్శనలో ఉంచాలన్నారు. సైన్స్ ఫెయిర్ థీమ్స్‌గా భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం, భూమి/అంతరిక్ష శాస్త్రం, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, జీవ శాస్త్రం /జీవ రసాయన శాస్త్రం, కంప్యూటర్ శాస్త్రం విభాగాలు ఉంటాయని వివరించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సత్తిబాబు

కాకినాడ రూరల్: సంస్థాగత నియామకాల్లో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడిగా పండూరు గ్రామానికి చెందిన నండూరి సత్తిబాబు ఎన్నికయ్యారు. పండూరు గ్రామంలో సోమవారం బీజేపీ సంస్థాగత ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడిగా పైడా వెంకటనారాయణ, ఎన్నికల అధికారిగా కవికొండల భీమశేఖర్ వ్యవహరించారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి



సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న ప్రసన్నకుమార్

బోట్‌క్లబ్: దేశంలో మానవ హక్కులను పరిరక్షించడంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అగ్రగామి సంస్థగా నిలిచిందని సంస్థ నేషనల్ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో సంస్థ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంస్థలో కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్ స్టేట్ డైరెక్టర్లుగా కొప్పిరెడ్డి సాంబమూర్తి, డ్రగ్స్ క్రైమ్ ప్రివెన్షన్ సెల్ స్టేట్ వైస్ చైర్మన్‌గా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తిని నియమించారు. నూతనంగా నియమితులైన వారికి నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సౌత్ ఇండియా చైర్మన్ బీఎస్ కృష్ణ, సంస్థ స్టేట్ వైస్ చైర్మన్ బొంగరాల రవిచంద్రన్, కాకినాడ సిటీ చైర్మన్ శ్రీనివాస్, రాంజీ పాల్గొన్నారు.

పరశురామావతారంలో సీతారామస్వామి



పరశురామావతారంలో సీతారామస్వామి

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత దశవతారం అలంకార ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

రోడ్డే వీరి అడ్డా..!

- రద్దీ రహదార్ల పక్కనే భారీ వాహనాల పార్కింగ్
- నిబంధనలను విస్మరిస్తున్న వాహన యజమానులు
- ప్రమాదాలు జరిగినా పట్టించుకోని వైనం
- కాకినాడ స్మార్ట్ సిటీ దుస్థితి



నాగమల్లితోట జంక్షన్ టీమ్ ఆస్పత్రి రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్

బోట్‌క్లబ్: అసలే ఇరుకు రోడ్లు, దీనికితోడు వాహనాల రద్దీ. రోడ్ల పక్కనే వీటిని పార్కింగ్ చేయడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం తప్పడం లేదు. దీనివల్ల నిత్యం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రమైన కాకినాడలో రోడ్ల పక్కన భారీ వాహనాలను పార్కింగ్ చేసి రోజుల తరబడి వదిలివేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనలకు తిలోదకాలిచ్చి కొందరు వాహన యజమానులు వాటిని రోడ్డు పక్కనే వదిలిపెడుతున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకూ కాకినాడ నగరంలోకి ఎటువంటి వాహనాల ప్రవేశానికి అనుమతులు లేవు. వీటిని శివారు ప్రాంతాల్లోనే ట్రాఫిక్ సిబ్బంది నిలువరించాల్సి ఉంటుంది. కొందరు వాహన యజమానులు తమ నివాసాల సమీపంలో ఉన్న వీధుల్లో వారి భారీ వాహనాలను రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ భారీ వాహనాలు పార్కింగ్ చేసి రోజుల తరబడి అలాగే వదిలివేయడంతో ద్విచక్ర వాహనదార్లకు ఎదురుగా ఏ వాహనాలు వస్తున్నాయో కానరావడం లేదు. దీంతో ప్రమాదాలు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో అపాయకర మలుపుల్లో సైతం వీటిని నిలిపిఉంచడం వల్ల నిత్యం ప్రమాద ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

ప్రయాణికుల పాట్లు

కాకినాడ నగరంలోని ఎల్‌బీనగర్, శశికాంత్‌నగర్, సిద్ధార్థనగర్, రాజేశ్వరినగర్, రామారావుపేట, జగన్నాథపురం, రెవెన్యూకాలనీ, సాంబమూర్తినగర్ వంటి ప్రాంతాల్లో నిత్యం భారీ వాహనాలు పదుల సంఖ్యలో పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఇతర ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడం వల్ల ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆయా దుకాణాల వద్ద కార్లు, లారీలు, ఇతర వాహనాలు నిలపడం వల్ల ఆయా ప్రాంతాల మీదుగా వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ సిబ్బంది మాత్రం ఇటువైపు చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. నిత్యం ఇక్కడ ప్రయాణికులు, సాదారణ ప్రజలు పడరాని పాట్లు పడుతున్నా.. ట్రాఫిక్ సిబ్బందికి పార్కింగ్ చేసిన లారీలు ఎందుకు కనిపించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. వాహన యజమానుల వద్ద నెలవారీ మామూళ్లు తీసుకుని, భారీ వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు కొందరు ట్రాఫిక్ సిబ్బంది చూసీచూడనట్టు వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రద్దీ ప్రాంతాల్లోను అంతే..

భారీ వాహనాలను రద్దీగా ఉండే ప్రాంతాల్లోను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే ప్రాంతాల్లో భారీ వాహనాలు రోడ్డు పక్కనే పార్కింగ్ చేయడంతో, రెండు, మూడు కార్లు ఒకేసారి వస్తే తప్పించేందుకు అవకాశం ఉండడం లేదు. ఆయా ప్రాంతాల్లో కార్లకు సైడు చోటు ఇచ్చేందుకు వీల్లేకపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో నగరంలో పలు ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి వేళల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. స్థానిక ఎల్‌బీనగర్‌లోని ప్రధాన రహదారిలో రెండు, మూడు లారీలు పార్కింగ్ చేసి వదిలివేస్తున్నారు. ఆ రోడ్డులోనే బ్రాందీషాపు ఉంది. ఈ దుకాణానికి వచ్చే వారు సైతం ఈ రోడ్డుపైనే తమ కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో నిత్యం ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లిన వారు గంటల తరబడి రాకపోవడంతో ట్రాఫిక్‌లో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

శివారు ప్రాంతాల్లోనూ..

ఇక శివారు ప్రాంతాల్లో సైతం వాహనాలను ఇష్టానుసారంగా రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి రోజుల తరబడి అలాగే వదిలి వేస్తున్నారు. స్థానిక శశికాంత్ నగర్, సిద్ధార్థనగర్, రాజేశ్వరినగర్, చైతన్యనగర్, జగన్నాథపురం, సాంబమూర్తినగర్, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో లారీలు, బారీ బస్సులను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి వచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు సైతం శివారు ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకూ పార్కింగ్ చేసి ఉంటున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల మీదుగా ప్రయాణించే వారు నిత్యం అవస్థలు పడుతున్నారు.



ఎల్‌బీ నగర్ ప్రధాన రహదారిలో కార్ల రాకపోకలకు అవరోధంగా మారిన లారీ

చాలా ఇబ్బందులు పడుతున్నాం



నేను ఐడియల్ కళాశాలకు ప్రతిరోజూ ద్విచక్ర వాహనంపై వెళుతుంటాను. ఇక్కడ రెండు పక్కలా లారీలను రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తున్నారు. ఈ రోడ్డులో కార్ల వంటివి వస్తే తప్పించుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఇక్కడ లారీలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవాలి.

– కె.శిరీష్, విద్యార్థి, కాకినాడ

ప్రత్యేక బీట్లతో గస్తీ



నగరంలో రోడ్డు పక్కన వాహనాలు నిలుపుదల చేయడం నిబంధనలకు విరుద్ధం. ఎక్కువ రద్దీ ఉండే ప్రాంతాల్లో రోడ్డు పక్కన భారీ వాహనాలు పార్కింగ్ చేస్తే అపరాద రుసుం వసూలు చేస్తాం. మళ్లీ అదే తప్పు చేస్తే వాహనాలు సీజ్ చేస్తాం.

– నూనె రమేష్, ట్రాఫిక్ సీఐ, కాకినాడ

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కార్పొరేషన్ కమిషనర్ భావన



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎనిమిది మంది ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా ఆలకించి, ఆయా అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు. వివిధ సమస్యలపై 28 అర్జీలు అందాయి. ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు.

సంకెళ్లతో దూసర్లపూడి నిరసన

కుళాయి చెరువు గేటు తెరవాలని డిమాండ్



కాళ్లు, చేతులకు సంకెళ్లతో నిరసన తెలుపుతున్న రమణరాజు

కాకినాడ సిటీ: కరోనా లాక్‌డౌన్ పేరిట మూడేళ్లుగా మూసి ఉంచిన కుళాయి చెరువు తూర్పుగేటు తెరవాలంటూ సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు సోమవారం కలెక్టరేట్ వద్ద కాళ్లు చేతులకు సంకెళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ గేటు తెరచి ప్రజల అవస్థలు తొలగించాలని ఎన్నో సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. అధికారులు ఏవో సాకులు చెబుతూ, స్మార్ట్ సైకిల్ ట్రాక్ అడ్డుగా ఉందని, పార్కింగ్ ప్రదేశం లేదని, ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నాయని చెబుతున్నారని విమర్శించారు. అధికారుల వ్యవహార శైలి చూస్తే విడ్డూరంగా ఉందన్నారు. సీఎం గ్రీవెన్స్‌కు పంపిన అర్జీకి కార్పొరేషన్ అధికారులు సమాచారం ఇవ్వకుండా, అభ్యంతరాలను స్వీకరించకుండా తిరస్కరించానని కార్పొరేషన్ డీఈఈ తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు. ఈ నిరసన దీక్షపై స్పందించిన కలెక్టరేట్ యంత్రాంగం, కమిషనర్‌కు సానుకూల వైఖరితో పరిష్కరించాలని డీఆర్వోకు సూచించారు. డీఆర్వో వెంకటరావు నుంచి పిలుపు రావడంతో దళిత గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక నాయకులు డోకుబుర్ర భద్రం, సాపే సుధాకర్, కొండేపూడి రవికుమార్, కుక్కళ్ల సత్యనారాయణ, వామపక్షాల నాయకులు డీఆర్వో వెంకటరావును కలిశారు. కమిషనర్ భావనకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, పార్కు తూర్పుగేటు ప్రవేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారులకు లేఖ పంపించి పరిష్కారం చూడాలని వివరించారు. కమిషనర్ కార్యాలయం, కలెక్టరేట్, సీఎం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నుంచి సమాచారం వచ్చే వరకు తాను దీక్ష చేస్తానని రమణరాజు స్పష్టం చేశారు. మంగళవారం నుంచి తన నిరసన నిరవధిక నిరహార దీక్షగా కొనసాగుతుందని ప్రకటించారు. సీనియర్ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాద్, దువ్వా శేషుబాబ్జీ, పేరాబత్తుల రాజశేఖర్, పలివెల వీరబాబు, తోకల ప్రసాద్, బోడకొండ, పెద్దిశెట్టి రామకృష్ణ, చింతపల్లి అజయ్‌కుమార్, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు రమణరాజు దీక్షకు సంఘీభావం తెలిపారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి మహా కుంభాభిషేకం



గాజుల అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

బోట్‌క్లబ్: నగరంలోని ద్వారకానగర్‌లో భక్తులకు కొంగు బంగారమైన కనకమహాలక్ష్మి అమ్మవారి మహా కుంభాభిషేక మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ ఆగమశాస్త్ర పండితులతో, మంత్రోచ్ఛరణల మధ్య కుంభాభిషేకం నిర్వహించారు. సుమారు 8 వేల మంది భక్తులు అమ్మవారికి అభిషేకం జరిపించారు. అమ్మవారి అభిషేకం నిర్వహించేందుకు భక్తులు గంటల కొద్దీ లైన్‌లో వేచి ఉండాల్సి వచ్చింది. భక్తులు స్వయంగా అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలు, పన్నీరు, కొబ్బరినీరుతో అభిషేకం చేసే అవకాశం కల్పించడంతో, అధిక సంఖ్యలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆగమ శాస్త్ర పండితులు చక్రవర్తుల గోపాలకృష్ణమాచారి ఆధ్వర్యంలో లక్ష కుంకుమ పూజ జరిగింది. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అమ్మవారిని గాజులతో ప్రత్యేకాలంకరణ చేశారు. అమ్మవారికి మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు అభిషేకం నిర్వహించారు. గత నెల రోజుల నుంచి అమ్మవారికి పూజలు వైభవంగా నిర్వహించినట్లు ఈఓ పి.కృష్ణారెడ్డి తెలిపారు. మహా కుంభాభిషేకం సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు.

గొడ్డటిపాలెంలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న గ్రామస్తులు, సంఘ కాపరులు

కరప: మండలంలోని గొడ్డటిపాలెంలో ఉన్న న్యూ టెస్ట్‌మెంట్ చర్చిలో సోమవారం సంఘ కాపరి రెవరెండ్ మేడపాటి కృపావరం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ జయప్రకాష్ క్రీస్తు రాక పరమార్థాన్ని వివరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్యాండిల్ సర్వీసు నిర్వహించి, క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. సర్పంచ్ గోన అనూష, మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, మండల పాస్టర్ల యునైటెడ్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ ఫాదర్ మేడపాటి రాజ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ గంజా జయరాంబాబు, ముత్యాల వీరంనాయుడు, నక్కా భవాని తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జనవరి 3వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో జె.వెంకటరావు, డీఈఓ పి.రమేష్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్క్వాష్ క్రీడాకారుల ఎంపిక ట్రయల్స్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ): రాష్ట్ర స్థాయి స్క్వాష్ క్రీడాకారుల ఎంపిక ట్రయల్స్ మంగళవారం నిర్వహించనున్నట్టు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.జార్జి తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈ ఎంపిక ట్రయల్స్ నిర్వహిస్తారని చెప్పారు. అన్ని జిల్లాల స్కూల్ గేమ్స్ సెక్రటరీలు(అండర్–14, 17, 19) అర్హత కలిగిన క్రీడాకారులకు సమాచారం అందజేయాలన్నారు, ఇతర వివరాల కోసం కాకినాడ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌ను సంప్రదించాలని కోరారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

కలెక్టరేట్ వద్ద వామపక్షాల నిరసన

కాకినాడ సిటీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఇంద్రపాలెం వంతెన వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, దేశంలో సకల రంగాల అభివృద్ధిలో అంబేడ్కర్ ఆలోచన ఉందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాన్ని అణువణువూ అంబేడ్కర్ విమర్శించారన్నారు. 1927 డిసెంబర్ 27న మనుధర్మ శాస్త్రాన్ని బహిరంగంగా దహనం చేసిన విషయాన్ని గుర్తించాలన్నారు. పార్లమెంట్‌లో అమిత్‌షా వ్యాఖ్యలు యథాలాపంగా అన్నవి కాదని, బీజేపీ ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగంపై దాడి చేస్తోందని అన్నారు. ప్రజాస్వామిక వాదులు, దేశహితం కోరుకునే ప్రతి ఒక్కరూ బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించాలన్నారు. అమిత్‌షాను పార్లమెంట్ బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు కె బోడకొండ, కరణం ప్రసాదరావు,, జె.వెంకటేశ్వర్లు, సీహెచ్ నాగేశ్వరరావు, వల్లూరి రాజబాబు, కొంకి రవి, అంబేడ్కర్ ఉద్యమ, దళిత సంఘాల నేతలు అయితాబత్తుల రామేశ్వరరావు, బొజ్జ అశోక్, పిల్లి రామారావు, టి నూకరాజు, కమిడి రవికుమార్, డోకుబుర్ర భద్రం తదితరులు మాట్లాడారు.

న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధం



న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమవుతున్న వేదిక

నగరంలో నాలుగు చోట్ల ఈవెంట్లు

బాలాజీచెరువు: మరికొన్ని గంటల్లో ఈ ఏడాది ముగియనుంది. డిసెంబర్ 31 ముగిస్తే చాలు.. చిన్నా పెద్దా తేడా లేకుండా, నూతనోత్సాహంతో గడుపుతారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. వారి ఉత్సాహాన్ని మరింత ఉత్తేజపర్చేలా నగరంలో పలు ఈవెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. యువత బైక్‌లతో చేసే హడావుడి అంతా ఇంతా కాదు. కోవిడ్ నేపథ్యంలో 2020, 2021 సంవత్సరాల్లో న్యూ ఇయర్ వేడుకలకు దూరం కాగా, గతేడాది అక్కడక్కడా సందడి చేశారు. ఈ ఏడాది భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రముఖ యాంకర్లతో పాటు, ముంబై నుంచి డ్యాన్సర్లను తెచ్చి వేడుకల నిర్వహణకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. కాకినాడకు సమీపంలో చేబ్రోలుతో పాటు, నగరంలో మూడు చోట్ల ఈవెంట్లకు ఏర్పాట్లు జరిగాయి.

ఆహ్లాదకర వాతావరణంలో..



యువత ఆలోచనల మేరకు వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఏ విధమైన వివాదాలు, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా, ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం.

– చిట్టూరి గీతాసారథి. ఈవెంట్ నిర్వాహకుడు

సంప్రదాయబద్ధంగా సంబరాలు చేసుకోవాలి

సీఐ చైతన్యకృష్ణ



క్రీడల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ చైతన్యకృష్ణ

కాకినాడ రూరల్: సంక్రాంతి సందర్భంగా జూద క్రీడల జోలికి పోకుండా, సంప్రదాయ పద్ధతిలో సంబరాలు నిర్వహించుకోవాలని కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డీఎస్ చైతన్యకృష్ణ అన్నారు. తిమ్మాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని సూర్యారావుపేట జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో సూర్యారావుపేట, పరకాలపేట, మైనర్‌పేట, లైట్ హౌస్‌పేటకు చెందిన గ్రామీణ యువతతో కబడ్డీ, వాలీబాల్ పోటీలను ముఖ్య అతిథి సీఐ చైతన్యకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ యువత కోడిపందేలు ,గుండాట, బొమ్మ బొరుసు, ఎత్తులాట, పందులు, పొట్టేలు పందేలు, క్రికెట్ బెట్టింగులు తదితర వాటితో పాటు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి జూద క్రీడలు వైపు వెళ్లకుండా నిరోధించేందుకు ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు ఈ క్రీడలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. పోటీలలో విజేతలకు బహుమతులు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం ఎస్సై ఎంవీవీ రవీంద్రబాబు, అడిషనల్ ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



నడకుదురులో పట్టుబడిన నిందితులు, గంజాయితో ఎస్సై, డీటీ తదితరులు

కరప: నడకుదురులో కరప పోలీసులు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కరప ఎస్సై టి.సునీత తెలిపిన వివరాల మేరకు, నడకుదురు గ్రామ శివారులోని రాధాసత్సంగ్ వెనుక ఉన్న సాయిబాబా గుడి సమీపంలో గంజాయిని రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై సునీత స్పందించి. ఏఎస్సై వి.సూరిబాబు, ఇతర సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, వీఆర్వోలు కె.గణపతిరావు, చాగంటి వెంకట్‌వరుణ్‌తో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీ చేశారు. కాకినాడకు చెందిన శేఖర్ అనే వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన కిల్లో శ్రీను, అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రీగూడకు చెందిన గల్లేళ్ల రమేష్ తారసపడ్డారు. వారిని తనిఖీ చేసి ఐదు కిలోల గంజాయిని గుర్తించారు. మధ్యవర్తుల సమక్షంలో నిందితులను అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీత తెలిపారు.